

ఆహార పదార్థాలలో
ఏం కలుపుతున్నారు?

3

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -38 బుధవారం 9 ఏప్రిల్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## బాంబు పేలుళ్ల ముష్కరులకు

# ఉరిశిక్ష



దిల్‌సుఖ్ నగర్ బాంబ్ బ్లాస్ట్ కేసులో సంచలన తీర్పు

ఎన్ఐ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

-అప్పీల్‌ను తిరస్కరిస్తూ..ఉరిశిక్ష వేసిన హైకోర్టు



హైదరాబాద్,ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):
దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు బ్లాస్ట్ కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితులను దోషులుగా నిర్ధారించిన హైకోర్టు.. వారు వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించింది. ట్రయల్ కోర్ట్ ఇచ్చిన తీర్పును జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధతో కూడిన ధర్మాసనం ధర్మాసనం సమర్ధించింది. అలాగే ఉరిశిక్షను ఖరారు చేసింది. మిగతాది 2లో...

## అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం- గెజిట్ విడుదల

వక్ఫ్ సవరణ చట్టం-2025 అమల్లోకి వచ్చింది. ఈ చట్టానికి సంబంధించిన బిల్లు ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. దీనిని అమల్లోకి తీసుకువస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటు ఉభయ సభల నుంచి ఆమోదం పొందిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారింది. ఈ చట్టాన్ని నేటి నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది. మరోవైపు, ఈ వక్ఫ్ చట్టంపై కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి మొత్తం 15 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వం కూడా కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దని సుప్రీంకోర్టును కోరింది.

## కంచ భూముల్లో

# భూకుంభకోణం

25 ఏళ్లు పూర్తిచేసుకున్న పార్టీ బిఆర్ఎస్

టిడిపి తరవాత తమదే సీనియర్ పార్టీ

ఏడాది పాటు పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

ప్రధాన ప్రతిపక్ష పాత్రను బాధ్యతగా పోషిస్తున్నాం

సెంట్రల్ వర్సిటీ భూములపై విద్యార్థులే పోరాడారు

కేసులు ఎలా పెటాలన్న ఆలోచనలో ప్రభుత్వం

మీడియాతో చిట్‌చాట్‌లో కెటిఆర్






హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల వెనుక రూ.వేల కోట్ల బాగోతం ఉంద ని త్వరలో భారీ భూ కుంభకోణాన్ని బయటపెడతానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూ మి వెనుక వేల కోట్ల వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో బిజెపి ఎంపీ ఉన్నారని చెప్పారు. రెండు జాతీయ పార్టీల జుట్టు ఢిల్లీ చేతిలో ఉందని, ఒకరు ఢిల్లీ నేతల చెప్పులు మో స్తే.. మరొకరు ఢిల్లీకి బ్యాగులు మోస్తున్నారని చు రకలు అంటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి 16 నెలలైనా మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదని అన్నారు. హెచ్‌సియు వ్యవహారంలో సిఎం రేవంత్‌రెడ్డి విఫలమైనందునే హైకమాండ్ జోక్యం చేసుకుంటోందని,అందుకే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు చేస్తున్నామని ఆరోపించారు. మిగతాది 2లో...

## యూనివర్సిటీల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పునర్నిర్మాణం వైపు ప్రజా ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ట్విట్టర్ వేదికగా ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ పక్రియను 15 సంవత్సరాల పాటు- నిర్వహించకపోవడం నిజంగా షాకింగ్ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలనలో విద్య రంగం పట్ల చూపిన నిర్లక్ష్యం పేద బిడ్డల భవిష్యత్‌ను దెబ్బతీసిందని సీఎం విమర్శించారు. ఇది క్షమించలేని నేరమని ఆయన పేర్కొన్నారు. మిగతాది 2లో...

## ఈనెల 10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు..
- చట్టసవరణ తో డబుల్ రిజిస్ట్రేషన్ కు చెక్..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..



హైదరాబాద్,ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలు అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునీకరణ కొనసాగుతున్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## మతపరమైన విభజనతో సమస్యలు పక్కదారి

- పటేల్ సిద్ధాంతానికి..ఆర్ఎస్ఎస్ భావజాలం వ్యతిరేకం
- జాతీయ నేతలపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్రలు
- పటేల్, నెహ్రూ సాన్నిహిత్యం గురించి వారికేం తెలుసు
- కాంగ్రెస్ కార్యవర్గ భేటీలో ఖర్గే అధ్యక్షోపన్యాసం




## చిన్న తప్పు చేసినా వీసా రద్దు!...

అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన



## మతపరమైన విభజనతో

# సమస్యలు పక్కదారి



- పటేల్ సిద్ధాంతానికి..ఆర్ఎస్ఎస్ భావజాలం వ్యతిరేకం
- జాతీయ నేతలపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్రలు
- పటేల్, నెహ్రూ సాన్నిహిత్యం గురించి వారికేం తెలుసు
- కాంగ్రెస్ కార్యవర్గ భేటీలో ఖర్గే అధ్యక్షోపన్యాసం

అహ్మదాబాద్,ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ భావజాలానికి భిన్నమైనదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో 'ఏమాత్రం పాత్ర లేని' సంస్థ పటేల్ వారసత్వం గురించి చెప్పుకోవడం హాస్యాస్పదం అని ఖర్గే అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ జాతీయ హీరోలకు వ్యతిరేకంగా 'పక్కా కుట్ర' సాగించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళవారం ఆరోపించారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ మెమోరియల్‌లో విస్తృత కాంగ్రెస్ కార్యవర్గం (సిడబ్లుసి) సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ, ఇప్పుడు మతపరమైన విభజనకు పాల్పడడం ద్వారా దేశంలోని మౌలిక సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. నెహ్రూ- పటేల్ మధ్య నిత్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. అన్ని విషయాలపై నెహ్రూ ఆయన సలహాలు తీసుకునే వారు. పటేల్ అంటే ఆయనకు అమితమైన గౌరవం. ఏదైనా సలహా తీసుకోవాల్సి వస్తే స్వయంగా నెహ్రూనే పటేల్ ఇంటికి వెళ్లేవారు.
మిగతాది 2లో...

## సింగపూర్‌లో అగ్నిప్రమాదం...



స్కూలులో జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్

ప్రమాదంలో బాబు చేతులు, కాళ్లకు గాయాలు

ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో చికిత్స

ప్రమాదం ఇంత తీవ్రంగా ఉందనుకోలేదు

అకీరా బర్త్‌డే రోజే ఇలా జరగడం విచారకరం

కుమారుడికి గాయాలపై పవన్ వెల్లడి

# బాంబు పేలుళ్ల ముష్కరులకు ఉరి

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 45 రోజుల పాటు హైకోర్టు సుదీర్ఘంగా విచారణను జరిపింది. 2016 డిసెంబర్ 13న ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించి ఉరిశిక్ష విధిస్తూ ఎన్ఐఏ కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో నిందితులు సవాల్ చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం తీర్పును వెల్లడించింది. బాంబ్ బ్లాస్ట్‌లో వీరి కుట్రను గుర్తించి దోషులుగా తేల్చింది. ఈ ఐదుగురికి ఉరిశిక్ష ఖరారు చేస్తూ హైకోర్టు ధర్మాసనం తీర్పును వెల్లడించింది. పేలుళ్లకు పాల్పడ్డ ఐదుగురికి ఉరి శిక్ష సరైనదేనని సంచలన తీర్పునిచ్చింది. 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 130 మందికి గాయాలు అయ్యాయి. ఈ విషాద ఘటన నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. 2016లో



ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు యాసిన్ భత్కల్ సహా ఐదుగురికి ఉరిశిక్ష విధించింది. అయితే కింది కోర్టు తీర్పుపై ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. ప్రధాన నిందితుడు రియాజ్‌భత్కల్ ఇప్పటికి పరారీలో ఉన్నాడు. ఈ జంట పేలుళ్లకు ప్రధాన కారకుడైన యాసిన్ భత్కల్ అని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాపులో, మిర్చిపాయింట్ వద్ద జరిగిన జంట పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 131 మంది గాయపడ్డారు. ఉరిశిక్ష పడిన నిందితుల్లో అసదుల్లా అక్తర్ అలియాస్ హద్ది, జియా ఉర్ రహమాన్ అలియాస్ వఘాస్ అలియాస్ నబీల్ అహమ్మద్, మహ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోను, యాసిన్ భత్కల్ అలియాస్ షారూఖ్, అజాజ్ షేక్ అలియాస్ సమర్ ఆర్మాన్ తుండె అలియాస్ సాగర్ అలియాస్ ఐజాజ్ సయ్యద్ షేక్ ఉన్నారు. అనంతరం ఉరిశిక్ష ధ్రువీకరణ నిమిత్తం ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టుకు నివేదించింది. దీంతోపాటు ఐదుగురు నిందితులు కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం సుమారు 45 రోజులపాటు సుదీర్ఘ విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. నేడు ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# మతపరమైన విభజనతో సమస్యలు పక్కదారి

(మొదటి పేజీ తరువాయి)

పటేల్ సౌలభ్యం దృష్టి ఉంచుకుని సీడబ్ల్యూసీ సమావేశాలు ఆయన ఇంట్లోనే నిర్వహించేవారు. అలాంటి గొప్ప నాయకులపై భాజపా-ఆర్ఎస్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఖర్గే ఆరోపించారు. మరొక వైపు స్వల్ప జనాధిపత్యం దేశ వనరులను గుప్పిటలోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని నియంత్రించే పథంలో సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సర్దార్ పటేల్‌ను ఖర్గే ఉటంకిస్తూ, సంస్థాగత బలం ప్రధానమైనదేనని, సంస్థ లేకుండా కేవలం సంఖ్యాబలం అర్థరహితం అని అన్నారు. గత అనేక సంవత్సరాలుగా జాతీయ హీరోలు పలువురి విషయమై పక్కా కుట్ర సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'గడచిన 140 సంవత్సరాలుగా దేశానికి సేవ చేసిన, దేశం కోసం పోరాడిన మహోన్నత చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తమ విజయాలుగా చూపేందుకు ఏమీ లేనివారే ఈ పని చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై ఖర్గే విరుచుకుపడుతూ, స్వాతంత్ర్యోద్యమంలో తమ కృషిగా చూసేందుకు వారికి ఏమీ లేదని ఆయన అన్నారు. సర్దార్ పటేల్, పండిత్ నెహ్రూ మధ్య సంబంధాన్ని ఆ దిగ్గజాలకు ఒకరంటే ఒకరికి పడదనేలా చూపేందుకు అవి కుట్ర పన్నాయి. వారు ఒక నాణానికి రెండు వైపుల వారనేది వాస్తవం. వారి మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు ఉన్నాయనేందుకు దాఖలాలుగా



అనేక ఘటనలు, పత్రాలు ఉన్నాయని ఖర్గే స్పష్టం చేశారు. 'వారిద్దరి మధ్య దాదాపు రోజూ ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతుండేవి. నెహ్రూజీ అన్ని విషయాలపై ఆయన సలహా తీసుకుంటుండేవారు. పటేల్ సాహెబ్ అంటే నెహ్రూజీకి అపార గౌరవం ఉంది. బాబా సాహెబ్ అంబేద్కర్‌ను రాజ్యాంగ సభ సభ్యునిగా చేయడంలో మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ ముఖ్య పాత్ర పోషించారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు లేకపోతే రాజ్యాంగం రచన జరిగి ఉండేదే కాదని 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో అంబేద్కర్ స్వయంగా చెప్పారని ఖర్గే గుర్తు చేశారు. 'రాజ్యాంగ రూపకల్పన జరిగినప్పుడు గాంధీజీని, పండిత్ నెహ్రూను, డాక్టర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్‌ను ఆర్ఎస్ఎస్ తీవ్రంగా విమర్శించిందని గుర్తు చేశారు. వారు రామ్‌లీలా మైదాన్‌లో రాజ్యాంగం, ఆ నేతల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. రాజ్యాంగానికి మనువాద లక్షాలు స్ఫూర్తి కాదని కూడా వారు అన్నారని ఖర్గే ఆరోపించారు. గాంధీ, బాబా సాహెబ్ విగ్రహాలను పార్లమెంట్ ప్రాంగణంలో నుంచి తొలగించి, ఒక మూలన పెట్టడం ద్వారా మోడీ ప్రభుత్వం వారిని అవమానించిందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను కాంగ్రెస్ గౌరవిస్తుంటుందని, దానిని ఎలా రక్షించాలో పార్టీకి తెలుసునని ఖర్గే స్పష్టం చేశారు. గాంధీతో సంబంధం ఉన్న సంస్థలను బిజెపి, సంఘ్ పరివార్ వ్యక్తులు స్వాధీనం చేసుకుని, వాటిని ఆయన సైద్ధాంతిక ప్రత్యర్థులకు అప్పగిస్తున్నట్లు కూడా ఖర్గే ఆరోపించారు. దేశంలో మతపరమైన విభజనలకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌లోని ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా దేశ సేవలో నిమగ్నమై ఉంది. స్వాతంత్ర్య సమరంలో ఎంతో పోరాడింది. అలాంటి పార్టీకి ప్రస్తుతం దేశంలో వ్యతిరేక పరిస్థితులను సృష్టిస్తున్నారు. మన పార్టీని అంతం చేయాలని చూస్తున్నారు. స్వతంత్ర దేశం కోసం ఏమీ సాధించని వారే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో సోనియా, రాహుల్, కెసి వేణుగోపాల్, దిగ్విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

---------

# కంచ భూముల్లో భూకుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్ రెడ్డి, బిజెపి మధ్య రహస్య బంధం ఉందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డిని కాపాడుతుందే బిజెపి నాయకత్వం అని పేర్కొన్నారు. దేశంలో బిజెపి, కాంగ్రెస్ ఉమ్మడిగా బలపర్చిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రెండు జాతీయ పార్టీల మద్దతుతో రేవంత్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ఆయన దేశంలో అత్యంత పవర్ ఫుల్ ముఖ్యమంత్రి అని చెప్పారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మంగళవారం నందినగర్‌లోని తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాజకీయ బాంబులు పేలకపోవటంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైలెంట్ అయ్యారని విమర్శించారు. అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందని తాము కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా విచారణ చేపట్టలేదని అన్నారు. రేవంత్, రాహుల్ (ఆర్ఆర్) టాక్స్ అని స్వయంగా ప్రధాని మోదీ అన్నారని%ో% కానీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో తాము పోటీకి దూరంగా ఉన్నామని చెప్పారు. హైదరాబాద్ పరిధిలో పోటీకి తమకు సరిపడా సభ్యులు లేని కారణంగానే పోటీ దూరంగా ఉన్నామని తెలిపారు. బిజెపి కోసం తామెందుకు పోటీకి దూరంగా ఉంటామని అన్నారు. ఎన్నికల్లో పోటీపై తమ విధానం తమకు ఉంటుందని స్పష్టం చేశారు. హెచ్‌సియు భూముల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అంత ఉలికిపాటు ఎందుకు..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచం అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుకుంటే హెచ్‌సియు భూముల అమ్మకం ఆపలేదా..? అని నిలదీశారు. బహిరంగ సభకు అనుమతి ఇవ్వకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ తర్వాత బిఆర్ఎస్ పార్టీ మాత్రమే విజయవంతంగా 25 ఏళ్లు పూర్తిచేసుకుంటోందని కెటిఆర్ అన్నారు. తెలుగు రాష్ట్రాలలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న రెండో తెలుగు పార్టీ బిఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. హన్మకొండలోని ఎల్కతుర్తిలో 1200 ఎకరాల్లో బిఆర్ఎస్ ఆవిర్భావ సభ ఉంటుందని తెలిపారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతివ్వాలని తమ పార్టీకి చెందిన వరంగల్ జిల్లా నాయకులు ఇప్పటికే ఎసిపిని కోరారని, ఇదే విషయంలో తాను డిజిపితో మాట్లాడానని చెప్పారు. బహిరంగ సభను పోలీసులు అనుమతి ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు. తమ పార్టీ రజతోత్సవ సభ కోసం 3 వేల ఆర్‌టిసి బస్సులు కేటాయించాలని తమ పార్టీ నేతలు ఆర్‌టిసి ఎండి సజ్జనార్‌ను కోరినట్లు తెలిపారు. బిఆర్ఎస్ చరిత్రలో రజతోత్సవ సభ అతి పెద్దది అవుతుందని వ్యాఖ్యానించారు. ఏడాది పాటు కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రతి నెలా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. జిల్లా పార్టీ కార్యాలయాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. మే నెలలో డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడతామని వెల్లడించారు. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని తెలిపారు. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చని అంటున్నారని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంటామని అన్నారు. మే నెల నుంచి అక్టోబర్ వరకు పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల నియామకంపై దృష్టి పెడతామని తెలిపారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు ప్రమాదకరం అని, వరంగల్ సభ ద్వారా ఇదే సందేశాన్ని కెసిఆర్ ప్రజలకు ఇవ్వబోతున్నారని తెలిపారు. హాస్టల్స్, గురుకులాల్లో సన్న బియ్యం ప్రవేశపెట్టిందే కెసిఆర్ అని చెప్పారు. సన్న బియ్యం కాన్సెప్ట్ కొత్తదేమీ కాదని, స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే.. కాంగ్రెస్‌కు ఉన్న ఆదరణ ఏంటో తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

## చిన్న తప్పు చేసినా వీసా రద్దు!... అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన

హైదరాబాద్ ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త): అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు పరిస్థితులు అనుకూలంగా లేవు. ఒకప్పుడు ఎంతో ఆశావహంగా కనిపించిన అమెరికా కల, ఇప్పుడు ఆందోళనలు, భయాలతో నిండిన పీడకలగా మారుతోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా వచ్చాక మారిన పరిస్థితులు, కొత్త విధానాలు, కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న జీవన వ్యయం, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం వంటి కారణాల వల్ల భారతీయ విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులు అతి వేగంగా వాహనం నడిపినందుకు లేదా సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టినందుకు వీసాలు రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు చిన్న పొరపాటు జరిగినా తమ భవిష్యత్తు అంధకారమవుతుందని ఆందోళన చెందుతున్నారు. "నేను ఎప్పుడూ భయంతో బతకాల్సి వస్తోంది. ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. మా భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది" అని ఓ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక విద్యార్థి మాట్లాడుతూ, "మా స్నేహితుడు ఒక చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన కారణంగా తన వీసాను కోల్పోయాడు. అతను వెంటనే భారతదేశానికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇది చాలా దారుణంగా ఉంది" అని చెప్పాడు. అమెరికాలోని కొన్ని కళాశాలలు అంతర్జాతీయ విద్యార్థుల వీసాల రద్దుకు సంబంధించిన సంఘటనలు పెరుగుతున్నాయని ధృవీకరించాయి. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని తెలిపాయి. దీనికి తోడు, అమెరికాలో చదువుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం. ట్యూషన్ ఫీజులు, వసతి ఖర్చులు, ఆహార ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. దీని కారణంగా చాలామంది విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాల విషయంలోనూ నిరాశ ఎదురవుతోంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం పొందడం అంత సులభం కాదు. వీసా నిబంధనలు కఠినంగా ఉండటం, కంపెనీలు విదేశీయులను నియమించడానికి వెనకాడటం వంటి కారణాల వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల చాలామంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని కూడా స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. భారత కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలను గుర్తించి, విద్యార్థులకు సహాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

# సింగపూర్‌లో అగ్నిప్రమాదం...

హైదరాబాద్, ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):సింగపూర్‌లోని స్కూల్‌లో అగ్ని ప్రమాదం కారణంగా కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌కు గాయాలు కావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తొలిసారి స్పందంచారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అరకు పర్యటనలో ఉండగా తనకు ఫోన్ వచ్చిందని తెలిపారు. తన కుమారుడు మార్క్ శంకర్ స్కూల్‌లో అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారన్నారు. ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయని వివరించారు. అయితే ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని తాను ఊహించలేదని ఆయన స్పష్టం చేశారు. తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ ఆరా తీశారన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహా ఈ ఘటనపై స్పందించిన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. స్కూల్ పిల్లలు సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లగా.. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో తన కుమారుడికి గాయాలైనట్లు తెలిపారు. సమ్మర్‌క్యాంప్‌లో అగ్నిప్రమాదం జరిగి నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. సుమారు 30మంది చిన్నారులు సమ్మర్‌క్యాంప్‌లో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. అగ్నిప్రమాదం చిన్నదే అనుకున్నా.. తర్వాత దాని తీవ్రత తెలిసింది. నా పెద్ద కుమారుడు అకీరా పుట్టిన రోజే.. రెండో కుమారుడికి ఇలా జరగడం బాధాకరం. రాత్రి 9.30గంటలకు సింగపూర్ బయల్దేరుతాను. పొగపీల్చడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం ఉండొచ్చని అన్నారు. ఈ ఘటన తెలుసుకొని అవసరమైన సహాయం చేసేందుకు చాలా మంది ముందుకొచ్చారు. ఈ సమయంలో నాకు అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలని తెలిపారు.

## యూనివర్సిటీల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో గత ప్రభుత్వం విఫలమైన తీరు రాష్ట్రం అభివృద్ధికి అడ్డు పడిందని చెప్పారు. ఈ మేరకు జరిగిన పొరపాట్లను గుర్తిస్తూ, సరిచేస్తూ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో గల ఖాళీలను నింపుతూ, నాణ్యతగల బోధనకు అవసరమైన మానవ వనరులను సమకూర్చే దిశగా ఈ చర్యలు ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త ఊపిరి లభించనుంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు ఇది కీలక దశగా మారనుంది. ముఖ్యంగా పేద కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు ఇది ఒక రకం న్యాయం కూడా. విద్యారంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మించిన దారి అంటూ, ముఖ్యమంత్రి పేర్కొంటూ ఈ పక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఈనెల 10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా, కేవలం 10-15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని ప్రకటించారు. మొదటి దశగా రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 22 కార్యాలయాల్లో ఈ విధానం ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రానుంది. హైదరాబాదులో ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట వంటి ప్రాంతాల్లో ప్రారంభించ నున్నారు. ఒకేసారి ఎక్కువ దస్తావేజులు సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించేందుకు ప్రతి కార్యాలయంలో పని వేళలను 48 స్లాట్లుగా విభజించారు. ప్రజలు స(గసశషు.ష(శెగశశ.గు. వెబ్‌సైట్ ద్వారా అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయంలో హాజరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. అత్యవసరంగా రాబోయే వారికి ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఐదు వాక్-ఇన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటు-ంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అధిక రద్దీ ఉన్న కార్యాలయాలకు అదనపు సబ్-రిజిస్ట్రార్లను నియమించనున్నట్లు- మంత్రి తెలిపారు. ఉదాహరణగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్-రిజిస్ట్రార్లు నియమించబడ్డారు. తద్వారా అక్కడ 144 స్లాట్లు- అందుబాటు-లో ఉంటాయి. పని భారాన్ని సమతుల్యం చేయడం కోసం, అధిక రద్దీ ఉన్న మరియు తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాల పరిధిని సమీక్షించి విలీనం చేస్తామని, మొదటగా చంపాపేట - సరూర్ నగర్ కార్యాలయాలను విలీనం చేస్తున్నట్లు- మంత్రి వివరించారు.

# సిసిరోడ్లు జల దిగ్బంధం

- మురికి కాలువతో దుర్వాసనలు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు
- ఆరోపిస్తున్న పట్టణ కేంద్రంలోని ప్రజలు



నర్సంపేట/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త): వేసవికాలంలో విచిత్ర (వింత) పరిస్థితితులు నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని జరుగుతున్నాయి. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 2వ, వార్డులో వర్షాకాలం తలపిస్తుంది. సీసీ రోడ్డుపై మురుగునీరు చేరి స్థానికులను భాదిస్తుంది. సీసీ రోడ్డు మురుగునీరుతో జలదిగ్బంధం కావడంతో మురుగు వాసన కారణంగా ప్రతీ ఒక్కరూ బాధించబడుతున్నారు. సమస్యకు పరిసర ప్రాంతంలో ఏపీఆర్జేసీ గురుకుల పాఠశాల ఉండటం విశేషం. ఎవ్వరైనా పర్వాలేదు పరిస్థితుల ప్రభావాన్ని అనుభవించక తప్పదు అన్న చందంగా మున్సిపల్ పని తీరు తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై కాస్త దృష్టి పెట్టాలని పరిసర ప్రాంతంలోని ప్రజలంతా పలుమార్లు వినతులు సమర్పించిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఎవరికి ఎలాంటి పట్టింపు లేకపోయింది. అక్కడి ప్రజలకు దుర్వాసనలు, దోమల సమస్య ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించి, కనీసం ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లడం వంటి సేవలకు నర్సంపేట ప్రజలు నోచుకోలేదంటే నమ్మాలి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యల పట్ల కాస్త దృష్టి సారించి, ఏర్పడిన సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగాలి

### -హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చురుగ్గా సాగేలా చూసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం పెంబర్తి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.



గ్రామంలో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. నిర్మాణ పనులకు సంబంధించి దశల వారీగా లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతుందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన ఇండ్లకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు రికార్డులు సమర్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అదేవిదంగా గ్రామంలోని రేషన్ షాప్ ను సందర్శించారు. ఇప్పటి వరకు ఎంత మందికి సన్న బియ్యం పంపిణీ జరిగిందని, ఇంకా ఎంత మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉందని సదరు డీలర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుకు సన్న బియ్యం పంపిణీ అందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్,స్థానిక తహసిల్దార్ చల్లా ప్రసాద్, ఇంచార్జి ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## అర్చకుడి కారు అద్దం ధ్వంసం.

**గణపురం/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతరామాలయ అర్చకులు ముసునూరి నరేష్ కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేసినట్లు తెలిపారు. వివరాల ప్రకారం తన ఇంటిముందు కారును నిలిపి ఉంచి దేవాలయంలో పూజలు నిర్వహిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో కారు అద్దాలను ధ్వంసం చేయగా కారు




వెనుక భాగంలోని అద్దం పూర్తిగా ధ్వంసం అయింది. కాగా శ్రీరామ నవమి వేడుకలను ఎన్నడూ లేని విధంగా ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు ఈ క్రమంలో దీనిని తట్టుకోలేని కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు ఈ క్రమంలో బాధిత అర్చకుడు నరేష్ తన కారు ధ్వంసం చెందిన విషయంలో గణపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు అర్చకులు తెలిపారు.

# క్షయ దావఖానలో

# జాగ్రత్త చర్యలు లేవు

- ఎవ్వరైనా సరే భయపడి తీరాల్సిందే
- అందుబాటులో లేని మెడికల్ సూపరింటెండెంట్
- సెలవు పెట్టి వెళ్లారంటున్న వైద్య సిబ్బంది
- ఇన్చార్జి బాధ్యతలు ఎవరికి అప్పగించారో తెలీదు
- దావకాన సమాచారం ఎవరు ఇచ్చే ప్రసక్తి లేదు
- ఎన్ని రోజులు సెలవు పెట్టారో ఏ సమాచారం లేదు



**హనుమకొండ/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఛాతి క్షయ దావకానలో సంబంధిత అధికారి సూపరింటెండెంట్ అందుబాటులో లేరు. మంగళవారం క్షయ దావకాన వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వారు సెలవు పెట్టి వెళ్లిపోయారని చెబుతున్నారు. ఎన్ని రోజులు సెలవు పెట్టి వెళ్లిపోయారో ఎవరికి ఏ సమాచారం లేదు. ఈ సందర్భంగా ఉన్నతాధికారి లేనప్పుడు ఇతరులకు ఎవరికైనా ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తారు. ఆ ఇంచార్జి బాధ్యతలు నిర్వర్తించే అధికారి ఎవరన్నా సంగతి ఎవరికీ తెలియకుండా పోయింది. ఈ క్రమంలో దావఖానకు చెందిన సమాచారం తెలుసుకోవాలంటే కష్టతరంగా మారింది. ఛాతి క్షయ దావఖాన ప్రాంగణంలోకి వెళ్లాలంటే ఎవరైనా సరే భయపడి తీరాల్సిందే. ఎందుకంటే అక్కడి వాతావరణం రకరకాల సమస్యలతో అలుముకుంటుంది. సాధారణంగా క్షయవ్యాధి




కలిగిన వ్యాధి గ్రహితులు అలుపెరుగని రీతిలో దగ్గుతూ ఉంటారు. అలాంటప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎవరైనా ఆరోగ్యంగా ఉన్నవారు ఆ ప్రాంతానికి వెళ్లే పరిస్థితి వస్తే, రక్షణగా మాస్కు ఇవ్వడం, లేదా మాస్క్ ధరించి లోపలికి వెళ్లాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి సూచనలు ఏర్పాటు చేస్తారు. అలా ముందస్తు జాగ్రత్తలను గుర్తు చేయడం పట్ల వ్యాధి గ్రహిస్తులతో పాటు ఇతరులకు సైతం లాభదాయకంగా ఉంటుంది. ఎలాంటి ప్రొటెక్షన్ ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా అక్కడ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు క్షయ దావఖానలో ఎంతమంది వ్యాధి గ్రహిస్తులు అడ్మిషన్ అయ్యారు? ఒక్క రోజుకు ఎంతమంది పరీక్షలు చేయించుకుంటున్నారు? ఒపి ద్వారా ఎంతమంది హాజరు అవుతున్నారు? ఎంతమంది వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు? వ్యాధి గ్రహిస్తులకు అవసరమైన చికిత్స అందుతుందా? లేదా? వారికి సంబంధించిన పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయా?



లేవా? పరిస్థితులు విషమించిన వారికి ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

దాదాపు హనుమకొండ వరంగల్ రెండు జిల్లాలకు చెందిన ఛాతి క్షయ దావకాన ఇది ఒకటి మాత్రమే దిక్కుగా మారింది. మరి రెండు జిల్లాలలోని బాధిత ప్రజలకు ఎంతమందికి సేవలందించే సామర్థ్యం దావఖానాలో ఉంది? వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? లేదా? ఇలా అనేక రకాల అనుమానాలు జంట నగరాల్లో చోటుచేసుకున్నాయి. సంబంధిత అధికారుల వద్ద సమాచారం తెలుసుకుందామంటే సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోయారు. ఎవరిని అడిగితే ఎవరిస్తారు? ఎవరికీ తెలియని పరిస్థితి దావఖానాలో చోటు చేసుకుంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆహార పదార్థాలలో

# ఏం కలుపుతున్నారు?

- ఒక్కటే సందర్భంలో పర్యవేక్షిస్తున్నారా?
- పాటించాల్సిన నిబంధనలపై బాధ్యత ఎవరిది?
- శాంపిల్స్ తీసి ల్యాబ్ కు పంపించడం మాత్రమేనా?
- నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందా?





**వరంగల్/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** పూర్వం పూర్వీకులంతా దాదాపుగా 100 సంవత్సరాలకు పైబడి జీవించేవారు. ప్రస్తుతం 50 సంవత్సరాలు జీవించడమే కష్టంగా మారింది. ఇలాంటి సందర్భాలపై గ్రామీణ ప్రాంతాల్లో అనేక చర్చలు జరుగుతూ ఉంటాయి. ఒక్కసారి ఆలోచిస్తే వారి చర్చలు నిజమేనని అనిపిస్తోంది. అందుకు నిదర్శనంగా వరంగల్ జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్నప్పటికీ, దాదాపు 400 పైచిలుకు ప్రైవేట్ హాస్పిటల్స్, డయాగ్నస్టిక్ సెంటర్స్ ఇలా అనేక రకాల ప్రైవేట్ హాస్పిటల్స్ రూపొందించబడ్డాయి. అంటే సగటున వరంగల్ జిల్లాలోని ప్రజలు దాదాపుగా 90 శాతం మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధించబడుతున్నారని అర్థమవుతుంది. ఇలాంటి పరిస్థితి ఎందుకు చోటు చేసుకుందన్న విషయం ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. స్థానికుల కథనం ప్రకారం మొట్టమొదటిగా అనారోగ్య సమస్యలు అంటే కేవలం తీసుకునే ఆహారాన్ని బట్టి వ్యాపిస్తున్నాయని మాట్లాడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతాన్ని భరించడం కష్టంగా మారిపోయింది. గతంలో అన్ని రకాల నిత్యవసర సరుకులతో పాటు ఏదైనా ప్రజలకు అనుకూలంగానే అందుబాటులో ఉండేది. ఒకదాని తర్వాత మరొకటి సామాన్య ప్రజలు మోయలేనంతగా భారంగా తయారయ్యాయి. ఈ క్రమంలో పని భారం ఎవరికివారు పెంచుకోవాల్సిన



పరిస్థితి దాపురించింది. ఈ క్రమంలో పని హడావిడిలో పడి సమయానికి భోజనం చేసే అవకాశం లేకుండా పోతుంది. ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరు వృత్తి ధర్మాన్ని పాటించే క్రమంలో భాగంగా ముందస్తుగా రోడ్డుపై ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్లతో పాటు రాయల్టీ హోటల్లలో నాణ్యత లేకుండా టిఫిన్స్ తయారు చేసి ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారస్తులు వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తిరిగి మధ్యాహ్నం సమయానికి భోజనం చేయాల్సిన సమయంలో పని భారం కారణంగా సరైన సమయానికి భోజనం చేయక, వివిధ రకాల అనారోగ్య పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది ఆరోగ్య పరిస్థితి సరిగ్గా ఉండటం లేదని అందుబాటులో ఉండే హాస్పిటల్స్ ఆశ్రయిస్తుంటారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సమయానికి భోజనం చేయకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని వారితో చెబుతున్నారు. సమయానికి భోజనం చేయకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని గమనించిన వ్యక్తులు అందుబాటులో ఉన్న హోటల్లను ఆశ్రయించి సమయానికి భోజనం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో టేస్టీగా వంటకాలు చేసి భోజనం చేసేవారికి వడ్డిస్తున్నారు. అయినప్పటికీ అనారోగ్య సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. కారణాలు ఏంటి అన్న సంగతి సంబంధిత అధికారులకు మాత్రమే తెలియాలి. దగ్గు సమస్యగా ఉందని కొండనాలుకకు మందు వేసుకుంటే ఉన్న నాలుక ఊడిపోయిందని సామెత గుర్తుకు వస్తోంది. సమయానికి భోజనం చేయకపోతే సమస్యలు వస్తున్నాయని భయపడిన వ్యక్తులకు బయట భోజనం



వల్ల మరింత సమస్యలు ముంచుకొస్తున్నాయి. టిఫిన్ సెంటర్, భోజన హోటల్స్ ఎక్కడ నిబంధనలు పాటించకుండా నాణ్యతలేని తయారీ చేస్తూ ఉంటారు. టేస్టీగా తయారు చేసే ఆహార పదార్థాల్లో ఏం కలుపుతున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కటే పద్ధతిని పాటించిన విధంగా సంబంధిత అధికారులు అనుమానిత ప్రాంతాల్లో పర్యటించి కేవలం శాంపిల్స్ తీసుకుని ల్యాబ్ కు పంపిస్తున్నారని న్యూస్ విడుదల చేస్తున్నారు. ఆ ఒక్క సందర్భం మాత్రమే పాటిస్తారా? ప్రస్తుతానికి నాణ్యతలేని ఆయిల్, నాణ్యతలేని పదార్థాలు, నాణ్యతలేని త్రాగునీరు, నాణ్యతలేనికుండా పాత్రలు కనిపిస్తుంటాయి. నాణ్యత లేని ఆహార పదార్థాలు ఇలా అనేక రకాల సమస్యలతో పాటు ప్రపంచవ్యాప్తంగా సంఘటితమైన ప్లాస్టిక్ నివారణ పాటించకుండా టిఫిన్ సెంటర్స్, హోటల్స్ యాజమానులు ఇష్టారీతిన వాడుతున్నారు. అలాంటి పరిస్థితులపై చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు కనీసం కనిపించిన సందర్భాలు లేవని గ్రామీణ ప్రాంతాల ప్రజలు విమర్శ చేస్తున్నారు. ఒక్కసారైనా టిఫిన్ సెంటర్స్, భోజన హోటల్స్ పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ప్రజల సమక్షంలో స్పష్టత ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మృతురాలి కుటుంబానికి యువశక్తి యూత్ ఆర్థిక సహాయం



రాయపర్తి/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):మండల కేంద్రంలోనీ కొత్త రాయపర్తి కాలానికి చెందిన గారే యమునా ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం మృతురాలి కుటుంబాన్ని యువశక్తి యువజన సంఘం అధ్యక్షుడు గారే వెంకటస్వామి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పరామర్శించి 24 వేల 500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,యూత్ గౌరవ అధ్యక్షులు గారే వెంకన్న, గారే శ్రీను, గారే సందీప్,మాచర్ల పరమేష్, గారే కుమార్,యూత్ ప్రధానకార్యదర్శి గారే మదు,ఉపాధ్యక్షుడు గారే నరేష్,కోశాదికారి గారే విష్ణు, గారే బాబు, గారే మహేందర్, గారే రమేష్, గారే రాజు, గారే శ్యామ్, గారే మహేందర్, గారే కిరణ్, గారే సంపత్,గారే వినయ్,గారే బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### -మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి.




**రాయపర్తి/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):**దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవ్వాలనీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బురహాన్ పల్లి గ్రామ%శీ% నుండి కొండూర్ మీదగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల ఇంచార్జ్ అస్రఫ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ అమలుకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన గొప్ప రాజ్యాంగమని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని గుర్తు చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ కందికట్ల రాజయ్య,బురహాన్ పల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు ఇంతలా వీరారెడ్డి, కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు గిరగాని రాజు,మండల నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి,గుగులోత్ శ్రీనివాస్ నాయక్, ఎనగందుల మురళి,ఉల్లెంగుల నర్సయ్య, చెవ్వ కాశీనాథం, ఐరెడ్డి ఎల్లారెడ్డి,గుగులోత్ యాకుబ్ నాయక్,ఖాజా, సూదుల నిఖిల్,రామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు

**-హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి**




**హనుమకొండ/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు గంజాయిని కొనుగోలు సేవించిన మైనర్ బాలుడితో సహ మరో ఆరుగురుని హన్మకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసారు. వీరి నుండి సుమారు 180గ్రాముల గంజాయితో పాటు ఒక సెలఫోన్, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి వివరాలను వెల్లడిస్తూ ఈ కేసులో ప్రధాన నిందితులు భూపాల్ పల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ(25), కోటగిరి రోహిత్(25)లు సులభంగా డబ్బు సంపాదించానికున్నారు. ఇందుకోసం నిందితులు ద్విచక్ర వాహనంపై ఒడిషా రాష్ట్రం కల్మీల గ్రామానికి వెళ్ళి అక్కడ నాగరాజు అనే వ్యక్తి వద్ద నిందితులు ఆర కిలో గంజాయి కొనుగోలు చేసారు. కోనుగొలు చేసిన గంజయిలో రోహిత్ కొంత మొత్తాన్ని తీసుకున్నాడు. మిగితా గంజయిని మరో నిందితుడు మోతే మణికంఠ నిన్నటి రోజున తన వద్ద వున్న గంజాయిని విక్రయించేందుకు హనుమకొండకు రావడంతో పోలీసులకు అందిన సమచారం మేరకు మోతే మణికంఠను హన్మకొండ పోలీసులు అదుపులో తీసుకొని బ్యాగ్ను తనిఖీ చేయగా అందులో గంజాయిని గుర్తించి పోలీసులు నిందితుడిని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా నిందితుడు ఇచ్చిన సమాచారం గంజాయి విియించిన మరో నిందితుడు రోహిత్‌తో పాటు గంజాయిని కొనుగోలు చేసిన మైనర్ బాలుడితో పాటు మేకల అవినాష్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి,ఓదెల అరుణ్‌లను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ఒడిషా చెందిన నాగరాజుతో పాటు, వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన తాళ్ళపెల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో వున్నారు. నిందితులను పట్టుకొవడం ప్రతిభ కనబరిచిన హన్మకొండ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్.ఐ పరుశురాములు, ఆడ్మిన్ ఆశోక్‌కుమార్, కానిస్టెబుల్ అనిల్,సతీష్,కిరణ్‌లను ఏసిపి అభినందించారు.

# మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగాల్లో రాణించాలి

**- ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది - హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**








**హనుమకొండ/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** మహిళా సంఘ సభ్యులు గ్రూపుగా ఏర్పడి సామూహికంగా వ్యాపార రంగాల్లో రాణించడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. మంగళవారం హసన్ పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆసరా స్టోర్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఓమిని మార్ట్ కేంద్ర ప్రభుత్వ ఆర్గనైజ్ సంస్థ సహకారంతో హనుమకొండ జిల్లా ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని మొదట సోమిడి గ్రామం, అదేవిధంగా నేడు వంగపహాడ్ గ్రామంలో ఆసరా స్టోర్ ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ మహిళలు వారి నైపుణ్యాన్ని బట్టి తయారు చేయు వివిధ వస్తువులను గ్రామంలో నేరుగా అమ్మేందుకు గాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మహిళా స్టోర్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా ఓమిని మార్ట్ సాంకేతిక సహకారంతో మహిళలకు శిక్షణ ఇచ్చి, నాణ్యమైన వస్తువులు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఒక యూనిట్ గా ఏర్పడి వారు తయారు చేసిన వస్తువులను వారే స్వయంగా విక్రయించడం ద్వారా అధిక లాభాలు సంపాదించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో దోహదపడగలరని రాష్ట్ర ప్రభుత్వం అందించు రాజీవయువశక్తి పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని పొంది ఆసరా స్టోర్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిఎం ఇండస్ట్రీస్ నవీన్ కుమార్, జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి బాలరాజు, డిడబ్ల్యూఓ జయంతి, ఓమిని మార్ట్ ఎండి రాజేష్, స్థానిక తహసిల్దార్ చల్లా ప్రసాద్, ఇంచార్జి ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**: -డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్**






**చెన్నారావుపేట/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** వైద్య సిబ్బంది వారికి నిర్దేశించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను, వ్యాక్సిన్ నిలువ ఉండే గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కేటాయించిన ఏ ఎన్ సి, టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. చిన్న పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత పెరిగినందున ఆయా సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ ఆయన వెంట డిపిఎంఓ జయరాజు, సిహెచ్ఓ భద్రయ్య, హెచ్ఈఓ వసంత, ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ సహజ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జక్కంపూడి కిషోర్





**తల్లాడ/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా జక్కంపూడి కిషోర్ ఎన్నికైన్నారు. మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్ క్లబ్ లో ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు డివిఎన్ రెడ్డి స్టేట్ చైర్మన్ సురేందర్ కిషోర్ తో పాటు ఎన్నికైన సభ్యులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బిల్లుపాడు గ్రామానికి చెందిన జక్కంపూడి కృష్ణమూర్తి తనయుడు కిషోర్ దశాబ్దాలుగా పైగా జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్టులు పనులు చేస్తున్నారు పనులు విషయంలో నాణ్యతంగా ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ కాంట్రాక్టుగా కిషోర్ గుర్తింపు పొందారు. కిషోర్ తో పాటు వైస్ చైర్మన్గా బాలసాని విజయ్ కార్యదర్శిగా బోడు వట్ల సైదా రావు జాయింట్ సెక్రటరీగా గొల్లపూడి మురళీకృష్ణ కోశాధికారిగా మారం హర్షవర్ధన్ రెడ్డి తో పాటు మరో 9 మందిని ఏం చేశారు. కిషోర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గా ఎంపికైన సందర్బంగా పలువురు అభినందన లు తెలియజేశారు. జిల్లాలో బిల్డింగ్ అసోసియేషన్ ప్రతిష్టాత్మంగా పెంచేలా కృషి చేస్థానని తెలిపారు.

# కోటగుళ్లలోని మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలి

**-బీజేవైఎం కళాశాల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్**





**గణపురం/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** ఘనపురం మండల కేంద్రంలోని కోటగుళ్లలో టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలని బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభమైందని పనులు పూర్తయి ఆరు నెలలు కావస్తున్న ఇప్పటివరకు ప్రారంభించడం లేదన్నారు దీంతో కోటగుళ్లకి వచ్చే పర్యాటకులు ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, టూరిజం శాఖ వారు స్పందించి వెంటనే మరుగుదొడ్లను ప్రారంభించి వాడుకలోకి తేవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి చెలిమల్ల ప్రవీణ్ కుమార్ బీజేవైఎం నాయకులు కర్క అన్వేష్ చరణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన డిడిఎన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం



**గణపురం/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉదయం స్వామివారికి హోమం బలిహరణ పూజా కార్యక్రమంలో డి డి ఎన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నే సాంబయ్య, నాచారం మల్లన్న గుట్ట ప్రధాన అర్చకుడు దేవరాజ్ పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయ అధ్యక్షుడు ముసునూరి నరేష్ వేద పండితులు పరాశర బట్టర్ అరుణాచార్య వారికి తీర్థ ప్రసాదాలు ఆశీర్వచనాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్ ఆలయకమిటీ సభ్యులు, భక్తులు యాంసాని రాజు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకుల్లో నో పెట్రోల్

**- కాకతాళియమా..కావాలనే చేశారా?**




**పర్వతగిరి/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని పెట్రోల్ బంకుల్లో మంగళవారం పెట్రోల్ కొరత నెలకొంది. పెట్రోల్, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం రెండు రూపాయల చొప్పున ఎక్సైజ్ టాక్స్ పెంచడంతో వాటి భారాన్ని చమురు సంస్థలే భరించాలని స్పష్టం చేసింది. కానీ స్థానికంగా ఉన్న కొన్ని పెట్రోల్ బంకులు మాత్రం విక్రయాలు జరపకుండా వినియోగదారులను వెనక్కి పంపించారు. ఇదేమిటని ప్రశ్నించిన వినియోగదారులకు పెట్రోలు స్టాక్ లేదని బంకుల యాజమాన్యం, సిబ్బంది చెప్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న 3 పెట్రోల్ బంకుల్లోనూ ఒకేసారి స్టాకు లేకపోవడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్ సుంకం పెరగడంతో ఆ మొత్తాన్ని వినియోగదారుల నుంచి రాబట్టేందుకు స్టాక్ అయిపోయిందని చెబుతున్నారా? లేక నిజంగానే స్టాక్ అయిపోయిందా? అంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# క్వారీలు తవ్వుతున్నారు సరే..! నిబంధనలు ఏమైనా పాటిస్తున్నారా?

**- సంబంధిత అధికారుల విచారణ కరువు - పర్మిషన్ ఇచ్చేటప్పుడు మాత్రమే చూస్తారు**



**హనుమకొండ ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలో అధికారులు వెల్లడించిన ప్రకారం సుమారు 15 క్వారీలు కొనసాగుతున్నాయి. అందులో 2 రకాల క్వారీలు ఒకటి నల్ల స్టోన్ క్వారీ, మరొకటి కలర్ స్టోన్ క్వారీలుగా పిలువబడుతున్నాయి. ఇలా ఒక్కొక్కరు దాదాపు 15 నుంచి 20 సంవత్సరాలుగా అనుమతులు తీసుకొని తమ ఇష్టానికి వ్యవహరిస్తూ తవ్వకాల నిర్వహణ చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారం తవ్వకాలు నిర్వహిస్తున్నారు సరే.. ప్రభుత్వ నిబంధనలు ఏమైనా పాటిస్తున్నారా? లేదా అన్న సంగతి ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత అధికారులు అటువైపు ఏమైనా కన్నెత్తి చూస్తున్నారా? ఎప్పుడైనా విచారణ చేశారా? కేవలం పర్మిషన్ కోసం సంబంధిత నిర్వాహకులు మైనింగ్ కార్యాలయం సంప్రదించినప్పుడు మాత్రమే పేపర్ పరంగా చూసి పర్మిషన్ జారీ చేస్తారు తప్ప, పరిస్థితులపై కన్నెత్తి చూసిన పాపాన పోలేదని స్థానికంగా వాదన వినిపిస్తోంది. అనుమతుల కోసం సర్టిఫికెట్లు సబ్మిషన్ చేస్తారు. అందులో పొందుపరిచే సర్వే నెంబర్లు, భూమి విస్తీర్ణం, ప్రభుత్వ నిబంధనలు, అతిక్రమిస్తే తీసుకోవలసిన చర్యలు ఇలాంటి వాటిపై ఎవ్వరు ప్రశ్నించే ప్రసక్తి ఉండదు. ఇంకా చెప్పాలంటే విచారించే అవకాశం ఎవ్వరూ తీసుకోరు. అందువల్లే గ్రామీణ ప్రాంతాల్లో క్వారీకి చెందిన స్టోన్స్ తరలించేటప్పుడు మార్గమధ్యలో దారులు ధ్వంసం అయిపోతున్నాయి. వాహనాల రాకపోకల మధ్య గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా? అనే సందిగ్ధంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు అయోమయంలో ఉన్నారు. క్వారీకి చుట్టు ప్రక్కల ఉన్న పంట పొలాలు ధ్వంసం అయ్యే ప్రమాదం చోటు చేసుకుంది. సంబంధిత అధికారులకు బాధిత వర్గాలు ఫిర్యాదులు చేయాలంటే అవకాశమే లేకుండా పోయింది. ఎందుకంటే మైనింగ్ సంబంధిత అధికారుల కార్యాలయాలు మండల స్థాయిలో అందుబాటులో లేవు కాబట్టి, జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు తిరిగి ఫిర్యాదు చేసేంత అవగాహన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు లేకపోయింది. మరికొంతమంది ప్రశ్నించాలని ప్రయత్నిస్తే క్వారీ అనుమతి పొందిన నిర్వాహకులు అందుబాటులో కనిపించరు. అక్కడ పనిచేస్తున్న వారిని ప్రశ్నించిన ఫలితం ఉండదు. గతంలో లింగమోరి గూడెం గ్రామంలో విజిలెన్స్ అధికారులు విచారించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటివరకు క్వారీలకు జారీ చేసిన అనుమతులు ఎలా ఉంటాయో? అందులో పొందుపరిచిన నియమ నిబంధనలు పాటిస్తున్నారో లేదో? అధికారులు పట్టించుకోక పోయినప్పటికీ, అనుమానాలు మాత్రం వ్యక్తం చేస్తూ స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఐనవోలు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను విచారించి, ప్రజల అనుమానాలకు నివృతి ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజా వర్గాలు కోరుతున్నాయి.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**-అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**





**సత్తుపల్లి/ఏప్రిల్8(జర్నలిస్టు వార్త):**అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం సత్తుపల్లి మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సందర్శించి వేగంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్నంలోని షాదీ ఖానా, దోబీ ఘాట్, ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే, వివేకానంద ఎక్సలెన్సీ, లైబ్రరీ, అర్బన్ పార్క్ లను పరిశీలించడం, ఎంపీడీవో ఆఫీసులో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ పర్యవేక్షించామని తెలిపారు. ఎస్సీ ఎస్టీ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించి, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

### బీజేపీ నాయకుల పిలుపు





**వేంసుర్/సత్తుపల్లి/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** వేంసూరు మండలలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశానుసారం మండలు అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన సంఘటన పర్వ్,సదస్యతా అభియాన్, సంస్థ గత అభియాన్, అను మూడు కార్యక్రమాల కార్యశాలను పల్లెవాడ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పరస రాంబాబు హాజరై మాట్లాడుతూ క్రియాశీలక సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి క్రియాశీలక సభ్యుడు వంద మంది కార్యకర్తలతో సమానమని, వీరంతా ప్రతి గ్రామంలోనూ బూత్ స్థాయిలో కార్యకర్తలను సమీకరిస్తూ స్థానిక సమస్యలపై పోరాటం చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపు దిశగా ప్రయత్నాలు కొనసాగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను ప్రజల మధ్యకి తీసుకువెళ్లి ప్రజల మద్దతును కూడగట్టాలని అన్నారు. దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి రహిత పాలనతో పాటు అంత్యోదయ సిద్ధాంతానికి అనుగుణంగా చిట్టచివరి నిరుపేద కి కూడా కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలను అందిస్తున్నారని ఇంకా గ్రామాల్లో అనేక పథకాలకు అర్హులైన లబ్ధిదారులను కలుసుకొని వారికి పథకాలపై అవగాహన కల్పించి అన్ని పథకాలు అందేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య, నల్లమోతు నాని, రఘునాథరెడ్డి, కృష్ణ, మహేష్, సాలి శివ స్థానిక బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆహార భద్రత కార్డు దారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ,,

**-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**





**భూపాలపల్లి/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** ఆహార భద్రత కార్డు దారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ,కార్యక్రమాని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కారల్ మార్క్స్ కాలనీలో లంబాడా సామాజిక వర్గానికి చెందిన భానోతు మౌనిక కిషన్ నాయక్ ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్నబియ్యం భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భోజనం చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ అద్దె ఇంట్లో నివసిస్తూ ఆటో, కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉగాదిన ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీతో ఇలాంటి పేదవారికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. సన్నబియ్యంతో భోజనం సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఆహార భద్రతా కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీతో పేదవారి కళ్ళలో ఆనందాన్ని స్వయంగా చూశానని అన్నారు. సన్నబియ్యం లబ్ధిదారుని కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని, సంతృప్తి ఇచ్చిందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. భోజన అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మౌనిక. కిషన్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం కిషన్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాకు చేరినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**-అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి**







**తల్లాడ/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వేసవి కాలం నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. చల్లని త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని, నాణ్యతా ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్ సంచులు, ప్యాడీ క్లీనర్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలో రైస్ మిల్లులకు తరలించాలని, అవసరమైన వాహనాలు సన్నద్ధం చేసుకోవాలని అన్నారు. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో నూతన రేషన్ కార్డు దరఖాస్తుదారుల విచారణ ప్రక్రియను ఆదనపు కలెక్టర్ పరిశీలించారు. పెనుబల్లి మండలం మందలపాడు గ్రామంలో సూర్య తేజ రైస్ మిల్లును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుబడి సకాలంలో పూర్తి చేయాలని, హమాలీల కొరత రాకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం వేంసూరు, పెనుబల్లి మండల తహసిల్దార్ కార్యాలయాలు సందర్శించిన అదనపు కలెక్టర్ ప్రభుత్వ భూమి రికార్డులను తనిఖీ చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి మండలం లో

# ఉదయం విపరీత ఎండ..సాయంత్రం గాలి వాన








క్షేత్ర స్థాయి లో నేల రాలిన పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిని శ్రావణి

**సత్తుపల్లి/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ,వెంసూర్ మండలాలలో బిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుండీ మధ్యహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం తో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు, సాయంత్రం ఒక్కసారిగావాతావరణం చల్లబడి విపరీతమైన గాలులతో వర్షం కురుస్తుంది.సోమవారం సత్తుపల్లి, వెం సూర్ మండలాలలో వడగండ్ల వాన కురిసింది. వడగండ్ల వాన కురవడం తో మామిడికాయలు నెలరాలయి.మొక్కజొన్నపంట, వరి నేలకొరిగింది. ఈరోజు కూడా ఒక్కసారిగా సాయంత్రం వాతావరణం చల్లబడి గాలులు తో కూడిన వర్షం కురిసింది. రేపు కూడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే నేపథ్యం లో ఉండడం తో రైతులు తమ పంట కాపాడుకోవడం కోసం నానా ఇబ్బందులూ పడుతున్నారు. ఉద్యాన శాఖ అధికారులు గాలి వర్షం కారణంగా మామిడి కాయలు రాలిన తోటలలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. పంట చేతికివచ్చే దశలో ఈ అకాల వర్షాలు కురవడం తో రైతులు దిగాలు గా ఉన్నారు.

## తక్కలపెల్లి కుటుంబానికి నాయకుల పరామర్శ



పర్వతగిరి/ఏప్రిల్ 8( జర్నలిస్ట్ వార్త): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మేనత్త, వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కలపల్లి నారాయణ రావు తల్లి తక్కలపల్లి సుభద్ర దేవి దశదిన కార్యక్రమం మంగళవారం వారి స్వగ్రామం ఏనుగల్లులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ రాజకీయ ప్రముఖులు, జిల్లా నాయకులు, పాలకుర్తి, వర్దన్నపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



**పర్వతగిరి/ఏప్రిల్ 8( జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండలలోని స్థానిక జడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో కవల పాఠశాలలయిన యుపిఎస్ బూరుగుమళ్ళ, యుపిఎస్ అన్నారం, యుపిఎస్ దౌలత్ నగరం పాఠశాలలతో ట్విన్నింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి లింగారెడ్డి మాట్లాడుతూ ట్వినింగ్ ప్రోగ్రాం వల్ల ప్రభుత్వ పాఠశాలను బలోపేతం అవుతాయని దీనికి మన మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి, వచ్చే సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మడత శ్రీనివాస్, సోమేశ్వర్, మదిలిమాయే మరియు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు ఆయా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల పరిసరాలను మౌలిక వసతులను ,బోధనా పద్ధతులను, పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# పేదరికం చదువుకు అడ్డు కాదు

### ప్రభుత్వ పాఠశాలలో చదివి డాక్టరేట్ సాధించిన కొట్టే అర్పిత







**ధర్మసాగర్/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కొట్టే అర్పిత డాక్టరేట్ పట్టా సాధించారు. ధర్మసాగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన అర్పిత, అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో విద్య కొనసాగించారు. అక్కడే ఆమె "డెవలపింగ్ రోబస్ట్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ప్రిసైస్ బ్రెయిన్ ట్యూమర్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూసింగ్ ఎంఆర్ఐ డేటా" అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్డీ పట్టా పొందారు. ధర్మసాగర్ ఎస్సి కాలనీకి చెందిన అర్పిత,సంగాల కరుణాకర్ సతీమణి. చిన్ననాటి నుంచి లక్ష్యసాధన కోసం కృషి చేయడం వల్లనే ఈ స్థాయికి చేరుకున్నానని ఆమె తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఒక ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. పేద కుటుంబ నుంచి వచ్చి డాక్టరేట్ సాధించిన అర్పితకు గ్రామస్థులు, బంధువులు అభినందనలు తెలిపారు.

# గుడిసెలకు పట్టాలు పాస్ పుస్తకాలు ఇవ్వాలి

### - సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జి. నాగయ్య



**చెన్నారావుపేట/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** 356 సర్వే నెంబర్ గల భూములకు, లింగగిరి లో వేసిన గుడిసెలకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య అన్నారు. మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో తాసిల్దార్ ఆఫీస్ ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య పాల్గొని మాట్లాడుతూ చెన్నారావుపేట మండలం పరిధిలో ఉన్నటువంటి నెంబర్ వన్ కాలనీ, ఖాదర్ పేట, జోజిపేట , లో ఉన్న 356 సర్వేనెంబర్ గల భూములకి పట్టాదారు పాస్ బుక్స్ ఇవ్వాలని కోరారు. గత 50 సంవత్సరాల నుండి రైతులు భూమిపై కాస్తు చేసుకుంటున్నప్పటికి ఇప్పటివరకు రైతులకు పట్టాదార్ పాస్ బుక్కులు ఇవ్వకపోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు.భూములకు పట్టాలేక ,రైతుబంధు ,రైతు భరోసా రుణమాఫీ, క్రాఫ్ లోన్లు, రావడం లేదని అని మండిపడ్డాడు 1971లో ఇందిరాగాంధీ హయాంలో రైతులకు బావులు తవ్వించి, ఎడ్ల బండ్లు ఇచ్చారని 1991, 2001, 2005 ఈ యొక్క భూములు అ సైడ్ చేయబడ్డాయని సూచించారు. తరవాత లావన్ పట్టగా ఉన్నాయని అన్నారు.లింగగిరి లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసం పెళ్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, ఏరియా కమిటీ కార్యదర్శి నమిండ్ల స్వామి, పరికి మధుకర్, మండల నాయకులు జన్ను రమేష్, ఏరియా కమిటీ సభ్యులు బిల్లా భూపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అబ్బ దాసి అశోక్, చేనురు యాకయ్య, రాజు, మొర్రి శ్రీను,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఐజేయూతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం



ధర్మసాగర్/ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త):దజర్నలిస్ట్ యూనియన్ ఐజేయుతోనే జర్నలిస్ట్ సమస్యలు పరిష్కారం అవుతాయని యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొట్టే లెనిన్ సుధాకర్ అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో మంగళవారం టి యు డబ్ల్యూ జే ఐ జేయు సభ్యత్వం హనుమకొండ జిల్లా యూనియన్ ఈసీ మెంబర్ అంబాటి విష్ణువర్ధన్ రాజు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుధాకర్ లెనిన్ మాట్లాడుతూ. జర్నలిస్టుల సమస్యలు ఐజేయుతోనే పరిష్కారం అవుతాయని ప్రతి ఒక్క జర్నలిస్ట్ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# కెటిఆర్ అరెస్ట్ కాకుండా రేవంత్ అడ్డుపుల్ల

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణ



హైదరాబాద్ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త): భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా సీఎం రేవంత్‌రెడ్డే కాపాడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఇంతకాలం అయినా కేసులు పెట్టి ఎందుకు విచారించడం లేదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు.కేటీఆర్, రేవంత్ ఏకమై భాజపాను దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారు. హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారు. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, భారాస ఎంపీలతో ఓటు వేయించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసే మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ భారాస అభ్యర్థిని బరిలోకి దించలేదు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? భూదందా, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపే మోదీ సర్కార్ కేంద్రంలో ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు.

-----

# భూ కబ్జాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

### బిఆర్ఎస్‌కు కడియం శ్రీహరి సవాల్



జనగామఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త): భూ కబ్జాలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిఆర్ఎస్‌కు కడియం శ్రీహరి సవాల్ విసిరారు. తనపై వచ్చిన భూకబ్జా ఆరోపణలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తిప్పికొట్టారు. బిఆర్ఎస్ నేతలు చేస్తున్న కుట్రలుగా అభివర్ణించారు. భూ కబ్జాలను నిరూపించాలని సవాల్ చేశారు. దేవునూరు గుట్టలను ఆక్రమిస్తున్నారంటూ భారాస నేతలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. దీనిపై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. 2వేల ఎకరాలు కబ్జా చేశానంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. బినామీలకు భూములు అప్పగించేందుకు యత్నిస్తున్నానంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. నేను కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్య ఇంట్లో గులాంగా పనిచేస్తా. ఆరోపణలు నిరూపించలేకపోతే వారు నాకు గులాంగా ఉంటారా? తప్పుడు ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా అని కడియం శ్రీహరి అన్నారు. తన విమర్శలను తట్టుకోలేక ఎదురుదాడి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరేమిటో ప్రజలకు బాగా తెలుసుని అన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు





**వరంగల్/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమయపాలన పాటించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి సాంబశివరావు అన్నారు. మంగళవారం దుగ్గొండి, నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులను , వైద్యసిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సమయపాలనపై వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరారు. అనవసరమైన శస్త్రచికిత్సలు చేయకుండా సాధారణ ప్రసావాలు ప్రోత్సహించాలని సూచించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి, తగిన చికిత్సలు అందించాలన్నారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ, ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగిన చికిత్సలు తీసుకోవాలని అన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవఖానాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారని తెలిపారు.

కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేశారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు, వడదెబ్బ గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని తెలిపారు. ఎండాకాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కార్నర్ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 11న జరిగే జాబ్ మేళాకు పక్కడ్బందీ ఏర్పాట్లు

### - సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా





**వరంగల్/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ నగరంలోని సికె నాయుడు కన్వెన్షన్ హాల్లో జరిగే జాబ్ మేళాకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 11న ఉదయం 9:30 గంటల నుండి జరిగే మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై నిర్వాహకులు, జిల్లా అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించి, సమర్థవంతమైన ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని వరంగల్ జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో టాస్క్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు అంకితభావంతో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రణాళిక బద్దంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. 60కు పైగా వర్చుసా, జంపాక్, ఫ్యాక్ కోన్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొని వేలాది మందికి పైగా ఉద్యోగాలు కల్పించనున్న నేపథ్యంలో మెప్మా, డిఆర్డిఓ, జిల్లా సంక్షేమ, యువజన శాఖలు, ఉపాధి కల్పన తదితర సంబంధిత శాఖల ద్వారా నిరుద్యోగ యువత పెద్దఎత్తున నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనితోపాటు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారికి వేసవి దృష్ట్యా జాబ్ మేళాకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలుగకుండా భోజనం, మంచి నీటి సౌకర్యం, అంబులెన్స్, ఆరోగ్య శిబిరం, నిరంతారాయ విద్యుత్తు, అగ్నిమాపక యంత్రాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పోలీస్ బందోబస్తు, ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కాగా, ఇటీవల మంత్రి కొండా సురేఖ క్యూఆర్ కోడ్ తో గల పోస్టర్ విడుదల చేశారు. వరంగల్ జిల్లా నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని, ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ప్రత్యేక అధికారి శ్రీరాముల శ్రీనివాస్, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, ఏసీపీ. నందిరామ్ నాయక్, జిల్లా అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎస్సీ,ఎస్టీ,బిసిల పట్ల వివక్ష

### పూలే విగ్రహ ఏర్పాటులై 11లోగా ప్రకటన చేయాలి -ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్

హైదరాబాద్ ఏప్రిల్8(జర్నలిస్ట్ వార్త)::

దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల జరుగుతున్న వివక్షను అడ్డుకోవాల్సి ఉందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీసీల హక్కుల కోసం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన దీక్షలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇది ప్రజాస్వామ్య దేశమా? అనే ప్రశ్నలను ఆమె సంధించారు. శ్రీరామనవమి సందర్భంగా రాజస్థాన్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికారాం జుల్లి రామాలయాన్ని దర్శించుకెళ్తే, ఆలయం మైలపడిందని అభిప్రాయపడుతూ సంప్రోక్షణ చేపట్టిన దళిత వ్యతిరేక వర్గాల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దౌర్భాగ్యమైన ఘటనలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్నాయంటే, ప్రజాస్వామ్యం, సమానత్వం, సోదరభావం అన్నది కేవలం మాటలకే పరిమితమవుతోందని ఆమె వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవానికి దేశపు గౌరవనీయ రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రపతి గిరిజన మహిళ అయితే ఏమి? ఆమెను ఆహ్వానించకపోవడం బీజేపీ ప్రభుత్వం ఎస్టీ సామాజిక వర్గం పట్ల తీసుకున్న దారుణ వైఖరని పేర్కొన్నారు. బీసీలకు కూడా ఈ దేశంలో ఇప్పటికీ అనేక అవమానాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. ధర్నాలు ఎందుకు చేస్తున్నాం? అని కొంతమంది అడుగుతున్నారని, బీసీ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నా ఆవేశం, ఆవేదన ఇవి. రాజకీయ అవసరం కాదు, ఇది హక్కుల పోరాటం అని స్పష్టం చేశారు. ఈబ్ల్యూఎస్ అమలుతో 50శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తేసిన నేపథ్యంలో, కోర్టులు రిజర్వేషన్‌ను అడ్డుకునే అవకాశమే లేదని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీలకు అర్హతకు తగ్గ రిజర్వేషన్లు ఇవ్వాలంటే ఇది సరైన సమయమని పేర్కొన్నారు. అసెంబ్లీ



ఆవరనలో ఫూలే విగ్రహం పెట్టాలని తాము కోరుతున్నామని, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని, ఇది రాష్ట్రానికి ప్రమాదమని కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకై కవిత మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదమని వ్యాఖ్యానించారు. ఇది రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని కవిత అన్నారు. ఇది పక్కకు జరిగితే తప్ప రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. ప్రజలను మోసం చేయడమే అనుముల పని అని విమర్శించారు. అనుముల ఇంటెలిజెన్స్‌ను వాడి కులగణనను తప్పదోవ పట్టించారని, బీసీకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సర్వే వివరాలను అసెంబ్లీలో పెట్టకుండా అధ్యయనం చేసిన తర్వాత రిజర్వేషన్ ఇస్తారట అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఎందుకు లేదని కవిత ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదని అన్నారు. ఆ వివరాలను వెల్లడించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని, అందుకు తాము కూడా కలిసి వస్తామని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలలాగా తాము ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షకు కూర్చుంటామని అన్నారు. చట్టసభలు బిల్లులను ఆమోదించి నాలుగు వారాలైందని, ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆ బిల్లులు గవర్నర్ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయా.. లేదంటే రాష్ట్రపతికి పంపించారా..? అని నిలదీశారు. బిల్లుల ఆమోదం తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం అన్నారని, కానీ ఇప్పటివరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదని అరోపించారు. బీజేపీతో రేవంత్‌రెడ్డికి లాలూచీ ఉన్నదని, బీజేపీని కాపాడటం కోసమే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని ఆరోపణలు చేశారు.అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడానికి బదులు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో తుఫేల్ ధర్నా చేశారని, ఆ ధర్నాకు రాహుల్ గాంధీ వస్తారని ఊదరగొట్టారని, కానీ చివరికి ఆయన రాలేదని కవిత చెప్పారు. ఢిల్లీలో కూడా ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడారని, ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తేవాలంటే వాళ్లకు అర్థమయ్యే భాషలో చెప్పాలని అన్నారు. రేవంత్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కులగణన నివేదికను అసెంబ్లీలో పెట్టాలని,ఏప్రిల్ 11లోగా పూలే విగ్రహం ఏర్పాటు-పై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.




# ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డుకు శ్రేయస్ అయ్యర్ నామినేట్

ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ గా ఉన్నాడు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన చాలా బాగుంది. పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్ 4లో ఉంది. ఇంతలో ఐసీసీ శ్రేయస్ అయ్యర్ పేరును ఒక ప్రతిష్టాత్మక అవార్డుకు నామినేట్ చేసింది. ఈ అవార్డు కోసం శ్రేయస్ అయ్యర్ మరో ఇద్దరు గొప్ప ఆటగాళ్లతో పోటీ పడుతున్నాడు. అత్యుత్తమ ఆటగాడిగా పరిగణించబడే ప్లేయర్ కు ఈ గౌరవం దక్కుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి టీమిండియా విజయం కీలకపాత్ర పోషించాడు. మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేస్తూ శ్రేయర్ అయ్యర్ చాలా పరుగులు చేసి జట్టును బలమైన స్థితిలో ఉంచాడు. ఈ టోర్నమెంట్‌లో మార్చి నెలలో శ్రేయస్ అయ్యర్ మొత్తం 172 పరుగులు చేశాడు. శ్రేయస్ అయ్యర్ భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ గా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ సగటు 57.33 కాగా.. అతను 77.47 స్ట్రైక్ రేట్ తో పరుగులు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. టోర్నమెంట్ అంతటా అపజయం లేకుండా నిలిచింది. ఈ విజయంలో శ్రేయస్ అయ్యర్ పాత్ర చాలా ఉంది. ఈ అద్భుతమైన ప్రదర్శన కారణంగా ఐసీసీ శ్రేయస్ అయ్యర్ ను మార్చి నెలలో ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ చేసింది. శ్రేయస్ తో పాటు న్యూజిలాండ్ కు చెందిన జేకబ్ డఫీ, రచిన్ రవీంద్ర కూడా నామినేట్ అయ్యారు. మరో వైపు మహిళల విభాగంలో ఈ అవార్డు కోసం చేతన ప్రసాద్(అమెరికా), జార్జియా వాల్(ఆస్ట్రేలియా), అన్నాబెల్ సదర్‌ల్యాండ్(ఆస్ట్రేలియా) పోటీ పడుతున్నారు.శ్రేయస్ అయ్యర్‌తో పాటు మార్చి నెలకు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు న్యూజిలాండ్ కు చెందిన ఇద్దరు ఆటగాళ్లను కూడా ఐసీసీ నామినేట్ చేసింది. మొదటి స్థానంలో రచిన్ రవీంద్ర ఉన్నాడు. రచిన్ రవీంద్ర ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనను ప్రదర్శించాడు. తన జట్టును ఫైనల్స్ కు తీసుకెళ్లడంతో కీలక పాత్ర పోషించాడు. రచిన్ రవీంద్ర 50.33 సగటుతో, 106.33 స్ట్రైక్ రేట్ తో 151 పరుగులు చేశాడు. రచిన్ రవీంద్ర 3 వికెట్లు కూడా తీసుకున్నాడు.మరో ఆటగాడు జేకబ్ డఫీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడలేదు కానీ పాకిస్థాన్ తో జరిగిన టీ20 సిరీస్ లో అద్భుతంగా బౌలింగ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత పాకిస్థాన్ జట్టు న్యూజిలాండ్ లో పర్యటించింది. రెండు జట్ల మధ్య 5 టీ20 మ్యాచ్ ల సిరీస్ జరిగింది. ఈ సిరీస్ ను న్యూజిలాండ్ 4-1 తేడాతో గెలుచుకుంది. ఈ సిరీస్ లో జేకబ్ డఫీ 13 వికెట్లు పడగొట్టి పాకిస్థాన్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. తన అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో జేకబ్ డఫీ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో నంబర్ 1 బౌలర్ అయ్యాడు. ఇప్పుడు ఈ ముగ్గురు ఆటగాళ్లలో శ్రేయస్ అయ్యర్, రచిన్ రవీంద్ర, జేకబ్ డఫీలలో ఒకరిని ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు వరించనుంది. ఐసీసీ ఓటింగ్ అకాడమీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు తమ ఓట్ల ద్వారా విజేతలను నిర్ణయిస్తారు. విజేతల పేర్లు వచ్చే వారం ప్రకటిస్తారు.



## పాటీదార్‌పై గావస్కర్ ప్రశంసలు

2025 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటివరకు ఆడిన నాలుగింట్లో మూడో విజయం నమోదు చేసుకుంది. కొత్త కెప్టెన్ రజత్ పాటీదార్ నాయకత్వంలో ఆర్సీబీ అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. ఈ క్రమంలో టీమ్ఇండియా లెజెండరీ సునీల్ గావస్కర్ ఆర్సీబీ కెప్టెన్ పాటీదార్‌పై ప్రశంసలు కురిపించాడు. మైదానంలో అతడు ప్రశాంతంగా జట్టును నడిపించడం ఆర్సీబీ విజయాలకు ఓ కారణమని అభిప్రాయపడ్డాడు.'ఓ కెప్టెన్‌గా పాటీదార్‌కు జట్టులో పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆ జట్టు 17ఏళ్లుగా టైటిల్ సాధించలేకపోయింది. అయితే మ్యాచ్‌లు గెలవాలంటే ఏం చేయాలో వాళ్లకు ఇప్పుడు అర్థం అయ్యింది. ప్రశాంతంగా ఉండే కెప్టెన్‌తోపాటు టీమ్‌లోని మిగతా సభ్యులు కూడా తమ అనుభవంతో జట్టును ముందుకు నడిపిస్తున్నారు' అని ఓ స్పోర్ట్స్ పాడ్‌కాస్ట్‌లో గావస్కర్ పేర్కొన్నాడు. కాగా, ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో కోల్‌కతాపై విజయం సాధించిన ఆర్సీబీ, తర్వాత చెన్నైని చెపాక్‌లో చిత్తు చేసింది. 17ఏళ్ల తర్వాత చెన్నైని తమ సొంతగడ్డపై ఆర్సీబీ ఓడించడం విశేషం. ఆ తర్వాత హోం గ్రౌండ్‌లో గుజరాత్‌తో ఓటమి ఎదురైనా, తాజాగా వాంఖడే వేదికగా ముంబయిపై విజయంతో మళ్లీ గెలుపు బాట పట్టింది. అయితే వాంఖడేలో ముంబయిపై ఆర్సీబీ నెగ్గడం గత ఆరు మ్యాచ్‌ల తర్వాత ఇదే తొలిసారి.

# ట్రంప్ దెబ్బకు షేర్స్‌క్రాష్

**ట్రంప్ టారిఫ్‌లతో ఆర్థిక మాంద్యం భయాలు**

**గ్లోబల్ మార్కెట్లు భారీ పతనం**

**ఒక్క రోజే 2,227 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**ఇన్వెస్టర్ల సంపద రూ.14 లక్షల కోట్లు ఆవిరి**



అమెరికా, చైనాల మధ్య రగిలిన సుంకాల సమరం ప్రపంచ స్టాక్ మార్కెట్లను గడగడలాడించింది. ట్రంప్ ప్రతీకార సుంకాలు విధిస్తే చైనా తామేమి తక్కువ కాదంటూ అదనపు సుంకాలు విధించడంతో వాణిజ్య భయాలు మరింత తీవ్రమయ్యాయి. దీంతో ద్రవ్యోల్బణం ముంచుకొస్తుందన్న భయం మదుపరులలో చుట్టుముట్టింది. దీంతో వారు అమ్మకాలకు సిద్ధపడ్డారు. ఇది సునామీలా మారి మార్కెట్లను కుప్పకూల్చింది. బిఎస్ఇ ఒక్కరోజే 2,227 పాయింట్లు తగ్గింది. రూ.14లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి అయింది. జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా,హాంకాంగ్ మార్కెట్లు దారుణంగా పతనమయ్యాయి.ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లతో ప్రపంచ మార్కెట్లు గజగజ వణుకుతున్నాయి. వాణిజ్య యుద్ధం ఆందోళనలు, యుఎస్‌లో మాంద్యం భయాల కారణంగా భారత్‌తో పాటు గ్లోబల్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. భారత స్టాక్‌మార్కెట్లు ఈ సంవత్సరం రెండో అతిపెద్ద పతనాన్ని చవిచూశాయి. సోమవారం ఒక్క రోజే ఇన్వెస్టర్ల సంపద రూ.14 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. మార్కెట్లు ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే సెన్సెక్స్ ఏకంగా 3,000 పాయింట్లకు పైగా పడిపోయింది. అయితే ఆఖరి సమయంలో కోలుకుని 2,227 (2.95 శాతం) నష్టంతో 73,137 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ కూడా అత్యధికంగా 743 పాయింట్లు (3.24 శాతం) నష్టపోయి 22,162 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 స్టాక్‌లలో 29 స్టాక్‌లు క్షీణించాయి. టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్ అండ్ టి షేర్లు 7 శాతం వరకు పడిపోయాయి. రంగాల వారీగా సూచీలలో నిఫ్టీ మెటల్ అత్యధికంగా 6.75 శాతం పడిపోయింది. రియాల్టీ 5.69 శాతం క్షీణించింది. ఆటో, ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకులు, చమురు, గ్యాస్, ఐటి రంగాలు 4 శాతం క్షీణించాయి. ఏప్రిల్ 2 నుండి ముడి చమురు ధర 12.11 శాతం తగ్గింది. సోమవారం బ్రెంట్ ముడి చమురు 4 శాతం తగ్గి 64 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. ఇది గత 4 సంవత్సరాలలో అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ) మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1,850 పాయింట్లు (4.60 తగ్గి 38,630 స్థాయికి చేరుకుంది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2,860 పాయింట్లు (6.20 శాతం) తగ్గి 42,999.82 వద్ద ట్రేడయింది. స్టాక్ మార్కెట్లో అమ్మకాల కారణంగా పెట్టుబడిదారుల సంపద సుమారు రూ.14 లక్షల కోట్లు తగ్గింది. ఏప్రిల్ 4 శుక్రవారం బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.403.34 లక్షల కోట్లుగా ఉంది. సోమవారం మార్కెట్ ముగిసిన తర్వాత ఇది దాదాపు రూ.389.25 లక్షల కోట్లకు తగ్గింది.



# పంజాబ్‌కు మూడో విజయం

ఐపిఎల్‌లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది మూడో గెలుపు కావడం విశేషం. ఇక చెన్నై ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింటిలో పరాజయం చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య 42 బంతుల్లోనే 9 సిక్సర్లు, ఏడు ఫోర్లతో 103 పరుగులు చేశాడు. మిగతా వారిలో శశాంక్ సింగ్ 36 బంతుల్లో 52 (నాటౌట్), మార్కో జాన్సన్ 19 బంతుల్లో 34 (నాటౌట్) రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 201 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (36), డెవోన్ కాన్వే (69) రాణించినా ఫలితం లేకుండా పోయింది.



## ప్రియాన్ష్ ఆర్య మెరుపు సెంచరీ...

యువ ఆటగాడు ప్రియాన్ష్ ఆర్య మెరుపు శతకం బాదడంతో చెన్నై సూపర్ కింగ్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు నమోదు చేసింది. ఛండీగఢ్ లో జరుగుతున్న ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది.
పంజాబ్ ఇన్నింగ్స్ లో ప్రియాన్ష్ ఆర్య బ్యాటింగే హైలైట్ అని చెప్పాలి. ఓవైపు వికెట్లు పడుతున్నా ఈ యంగ్ డైనమైట్ వీరబాదుడు బాదాడు. ఓపెనర్ గా వచ్చిన ప్రియాన్ష్ కేవలం 42 బంతుల్లోనే 103 పరుగులు చేశాడు. అతడి స్కోరులో 7 ఫోర్లు,9 సిక్సులు ఉన్నాయంటే చెన్నై బౌలర్లను ఎలా చీల్చిచెండాడో అర్థం చేసుకోవచ్చు. పంజాబ్ జట్టు 83 పరుగులకే 5 వికెట్లు కోల్పోయినా... ప్రియాన్ష్, శశాంక్ సింగ్ దూకుడైన బ్యాటింగ్ తో భారీ స్కోరు దిశగా నడిపించారు. శశాంక్ సింగ్ 36 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులతో 52 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ప్రియాన్ష్ ఆర్య ఆరో వికెట్ రూపంలో అవుట్ కాగా... ఆల్ రౌండర్ మార్కో యన్సెన్ వస్తూనే పరుగుల మోత మోగించాడు. యన్సెన్ 19 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సులతో అజేయంగా 34 పరుగులు చేశాడు. పంజాబ్ ఇన్నింగ్స్ లో ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ (0), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (9), మార్కస్ స్టొయినిస్ (4), నేహాల్ వధేరా (9), గ్లెన్ మ్యాక్స్ వెల్ (1) వంటి కీలక ఆటగాళ్లు విఫలమైనా గానీ, పంజాబ్ కింగ్స్ కు ఇంత స్కోరు వచ్చిందంటే ప్రియాన్ష్ ఆర్య సంచలన బ్యాటింగే కారణం. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2, రవిచంద్రన్ అశ్విన్ 2, ముఖేశ్ చౌదరి 1, నూర్ అహ్మద్ 1 వికెట్ తీశారు.

# అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్ వచ్చింది. స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా చేయనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థపై ఇది రానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఆయనకు విషెస్ చెప్పింది. మొత్తంగా అల్లు అర్జున్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్పెషల్ వీడియోను విడుదల చేశారు. పుష్ప' సినిమాతో నేషనల్ అవార్డు అందుకొని అల్లు అర్జున్ ట్రెండ్ సెట్ చేశారు. దీని రెండో భాగం భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో బన్నీ తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. హిట్ దర్శకుడు అట్లీతో ఓ సినిమా చేయనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడిదే విషయాన్ని ఖరారు చేస్తూ సన్ పిక్చర్స్ పోస్ట్ పెట్టింది. ఈ ప్రాజెక్ట్ వివరాలు పంచుకుంటూ ఓ వీడియో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు వీడియోలో చూపించారు.



అభిమానుల ఊహలకు అందని రీతిలో ఈ సినిమా ఉండనుందని తెలిపారు. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించ నున్నారు. దీని కోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించారు. హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ నిపుణులు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ ఇలాంటి స్క్రిప్ట్ ఇప్పటివరకూ చూడలే మొదట అల్లు అర్జున్ ,అట్లీ, నిర్మాత కళానిధి మారన్ కలిసి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు చూపించిన మేకర్స్.. ప్రీ ప్రొడక్షన్ పనుల కోసం లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించినట్లు చూపించారు. ఇందులోనే అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన చేయగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్ చూస్తుంటే.. గ్రాఫిక్స్ ప్రధాన పాత్ర పోషించబోతున్నట్లు తెలుస్తుంది.



## సుహానా ఖాన్‌కు తల్లి పాత్రలో దీపిక

బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా చక్రం తిప్పుతోన్న దీపికా పదుకొణె తల్లి పాత్రలో దర్శనమివ్వబోతోంది. . 2007లో 'ఓం శాంతి ఓం' చిత్రంతో ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది మొదటి సినిమాతోనే తన అందం నటనతో హిందీ ప్రేక్షకులను కట్టిపడేసింది. తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ అనతి కాలంలోనే టాలెంట్ తో కోట్లల్లో అభిమానులను సంపాదించుకుంది. అంతేకాదు బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం అందుకుంటు-న్న హీరోయిన్ కూడా దీపికనే. తాజాగా మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్న దీపిక చివరగా తెలుగులో 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో నటించి దక్షిణాది ఆడియెన్స్‌ను కూడా ఫిదా చేసింది. అయితే ఇలాంటి స్టార్ హీరోయిన్ తాజా సమాచారం ప్రకారం తల్లి పాత్రలో నటించబోతుందట.. బాలీవుడ్ హిట్ జోడీల్లో షారుక్ ఖాన్, దీపికా పదుకొణెల జంట ముందు వరుసలో ఉంటు-ంది. వీరిద్దరి కాంబినేషన్ వచ్చిన 'ఓం శాంతి ఓం', 'చెన్నై ఎక్స్ ప్రెస్','పఠాన్' లాంటి ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలు ఎంతో అలరించగా. ఇప్పుడు ఈ జోడీ మరోసారి తెరపైకి రానుందట. షారుక్ ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో 'కింగ్' అనే మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపిక ఓ ప్రత్యేక పాత్రలో నటించబోతున్నట్టు సమాచారం. అది కూడా సుహానాకు తల్లిగా దీపికను ఎంపిక చేసిందట చిత్రబృందం. ప్రతీకార నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నటించడానికి దీపికా కూడా చాలా ఉత్సాహంగా ఉందట. ప్రస్తుతం ఈ విషయంపై ఆమెతో చర్చలు చేస్తోందట చిత్రబృందం. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

## 'గుడ్ బ్యాడ్ అగ్లీ' నుంచి అద్భుతమైన ట్రైలర్ విడుదల



ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ కోలీవుడ్ ఐకాన్ అజిత్ కుమార్ హీరోగా నిర్మించిన మల్టీ లాంగ్వేజ్ ప్రాజెక్ట్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. టి- సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. హీరో అజిత్‌ను డిఫరెంట్ అవతార్స్‌లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో చూపించిన ట్రైలర్ అదిరిపోయింది. తన కొడుకును కాపాడుకోవడానికి వయోలెంట్‌గా కనిపించే అజిత్ క్యారెక్టరైజేషన్ చాలా ఆసక్తిని పెంచింది. భయాన్నే భయపెడతాడనే డైలాగ్ హీరో క్యారెక్టర్ ఎంత పవర్‌ఫుల్‌గా వుండబోతోంది సూచిస్తోంది. ట్రైలర్‌లో అద్భుతమైన విజువల్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, యాక్షన్ అజిత్ అభిమానులను కట్టిపడేశాయి. ట్రైలర్‌లో త్రిష కృష్ణన్, అర్జున్ దాస్, ప్రభు, ప్రసన్న, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు.

## గర్ల్‌ఫ్రెండ్ అంటూ ఎవరూ లేరు

### శ్రీలీలతో అఫైర్‌పై ఆర్యన్ కార్తీక్ పరోక్ష సంకేతం

ప్రేమించుకోవడం విడిపోవడం, డేటింగ్ చేయడం, అన్ని కుదిరితే పెళ్ళి చేసుకోవడం సినీ ఇండస్ట్రీలో కామన్. ఇక, హీరో, హీరోయిన్‌లు కలిసి ఓ రెండు సార్లు బయట కనిపించారు అంటే చాలు.. పుకార్లు స్టార్ట్ అవుతాయి.. వాళ్లు ఏ పని మీద మీట్ అయ్యారు అనేది పక్కన పెడితే.. ఇష్టం వచ్చినట్లు ఊహించు కుంటారు. వీటిపై కొందరు రియాక్ట్ అవుతారు మరి కొందరు అస్సలు పట్టించుకోరు. కాగా, ప్రస్తుతం బాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా హీరో కార్తిక్, నటి శ్రీ లీలతో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే, అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తిక్ ఆర్యన్ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ షూటింగ్ సమయంలో కార్తిక్- శ్రీ లీల మధ్య మంచి పరిచయం ఏర్పడింది.. ప్రస్తుతం వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీనిపై వీరిద్దరూ ఎక్కడా కూడా స్పందించలేదు. తాజాగా ఓ హిందీ ఛానల్ తో ముచ్చటించి కార్తిక్ ' ఇండస్ట్రీలో నేను ఒక్కడినేనా.. ఇంకా చాలా మంది ఉన్నారు.. వారి గురించి ఎవరూ ఇలాంటివి రాయరు.. నా గురించి మాత్రమే అందరూ పిచ్చి వార్తలు రాస్తుంటారు అని మండిపడ్డారు. ఇక, ఇక్కడ నన్ను సపోర్ట్ చేయడానికి ఎవరూ లేరు అని కార్తిక్ ఆర్యన్ అన్నాడు. బాగా వినండి అందరికీ చెబుతున్నా.. ఇండస్ట్రీలో నాకు సినీ బ్యాగ్రౌండ్ లేదు, సోదరులు, స్నేహితులు, గర్ల్ ఫ్రెండ్ ఎవరు లేరని తేల్చి చెప్పాడు. వీటిని నిరూపించుకోవాల్సిన అవసరం నాకు లేదు.. ఎందుకంటే ఇలాంటి అబద్ధపు పుకార్లు పుట్టించే వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అంటూ పరోక్షంగా శ్రీ లీలతో డేటింగ్ మ్యాటర్ కి పుల్‌స్టాప్ పెట్టాడు కార్తిక్ ఆర్యన్.



## అఖిల్ కొత్త మూవీ..

## లెనిన్ గ్లింప్స్ అదుర్స్..



టాలీవుడ్ యంగ్ హీరో అఖిల్ కెరీర్ లో మంచి హిట్ కొట్టాలని ఎప్పటి నుంచో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. గత చిత్రం ఏజెంట్ మూవీ భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా.. అనుకున్న స్థాయిలో అఖిల్ మెప్పించలేకపోయారు. దీంతో తన అప్ కమింగ్ మూవీస్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. కథల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నారట.ఇప్పుడు రెండేళ్ల తర్వాత గుడ్ న్యూస్ చెప్పారు అఖిల్. తన కొత్త మూవీని అనౌన్స్ చేశారు. బర్త్ డే సందర్భంగా ఆ సినిమా గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. వినరో భాగ్యము విష్ణు కథతో ఇప్పటికే మూవీ లవర్స్ ను మెప్పించిన మురళీ కిషోర్ అబ్బూరు.. అఖిల్ కొత్త మూవీని తెరకెక్కిస్తున్నారు. ఎప్పటి నుంచో టాక్ వస్తున్నట్లు లెనిన్ అనే టైటిల్ నే ఫిక్స్ చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ తో పాటు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న లెనిన్ లో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న లెనిన్ మూవీ గ్లింప్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతోంది. స్టన్నింగ్ విజువల్స్ తో గ్లింప్స్ స్టార్ట్ అవ్వగా.. రథం ఎంట్రీ ఇచ్చింది. అప్పుడే మాస్ లుక్ లో అఖిల్ చేతిలో ఆయుధంతో నడుస్తూ కనిపించారు. గతాన్ని తరమటానికి పోతా.. మా నాయిన నాకో మాట సెప్పినాడు. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాదిరా పేరు ఉండదు. అట్నే పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటాది. ఈ పేరు ఎట్లా నిలబడాలి అంటే అంటూ ఓ రేంజ్ లో సాగింది గ్లింప్స్. ఆ తర్వాత అఖిల్, శ్రీలీలను రివీల్ చేశారు మేకర్స్. మాస్ లుక్ లో హీరో ఉండగా.. ఆయనను చేతిని పట్టుకుని హీరోయిన్ నిలబడి ఉన్నారు. అనంతరం హ్యాపీ బర్త్ డే అంటూ విషెస్ చెప్పారు మేకర్స్. ప్రేమ కంటే హింసాత్మకమైనది యుద్ధం కాదని అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే గ్లింప్స్ బట్టి.. మూవీ రూరల్ లవ్ డ్రామాగా క్లియర్ గా తెలుస్తోంది. అయితే లెనిన్ మూవీకి గాను అఖిల్ ఫుల్ గా మేకోవర్ చేసుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. మాస్ లుక్ ఆయనకు బాగా సెట్ అయినట్లు కనిపిస్తోంది. శ్రీలీల కూడా క్యూట్ గా కనిపిస్తున్నారు. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుండగా.. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. మొత్తానికి రెండేళ్ల తర్వాత మూవీ అనౌన్స్మెంట్ రాగా.. గ్లింప్స్ అదిరిపోయిందని అందరూ చెబుతున్నారు.



## బిజీగా ఉంటేనే ప్రశాంతంగా ఉంటా

తెలుగు ప్రేక్షకులకు రకుల్ ప్రీత్ సింగ్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. దాదాపు తెలుగు అగ్ర హీరోలందరితోనూ నటించిన రకుల్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఈ మధ్య రకుల్ పెద్దగా ఫామ్ లో లేకుండా పోయింది. రకుల్ నటించిన ఇండియన్2, మేరే హస్బెండ్ కీ బీవీ సినిమాలు అంచనాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం అజయ్ దేవగణ్, మాధవన్ లీడ్ రోల్స్ లో వస్తోన్న దే దే ప్యార్ దే2 లో నటిస్తోన్న రకుల్, నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణంలో కూడా నటించనుందని వార్తలొస్తున్నాయి. భాషతో సంబంధం లేకుండా తనకు నచ్చిన పాత్రలన్నీ చేసుకుంటూ వెళ్తున్న రకుల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది.ఎవరైనా సరే తమ కెరీర్లో ఉన్న ఫ్లాపుల గురించి మాట్లాడటానికి పెద్దగా ఇంట్రెస్ట్ చూపించరు. కానీ రకుల్ మాత్రం ఎలాంటి మొహమాటం లేకుండా ఫ్లాపుల గురించి మాట్లాడుతుంది. హిట్టూ ఫ్లాపుతో పాటూ బాక్సాఫీస్ వద్ద సక్సెస్సే కీలకమైన ఈ రోజుల్లో రకుల్ నిజాయితీగా ఫ్లాపుల గురించి మాట్లాడటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇండస్ట్రీలో హిట్టూ, ఫ్లాపులు చాలా కామన్ అని చెప్తున్న రకుల్, జీవితంలో మార్పులు చాలా సహజమని ఎన్ని కష్టాలొచ్చినా డబుల్ ఎనర్జీతో వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని, అలా చేయాలంటే ముందుగా మనమీద మనకు నమ్మకముండాలని అప్పుడే ఏదైనా సాధ్యమవుతుందని రకుల్ అభిప్రాయపడింది. . తన గురించి చెప్తూ, పనిలో ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటానని చెప్తోన్న రకుల్, షూటింగ్ లేకుండా ఖాళీగా ఉంటే ఎంతో ఒత్తిడికి గురవుతుంటానని తెలిపింది. వరుస షూటింగ్స్ లో తన షెడ్యూల్ నిండిపోయి ఉంటే తనకెంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుందని చెప్తోన్న రకుల్ ప్రతీ రోజూ కెమెరా ముందుకు ఎదుర్కోవడం తన లైఫ్ లో రొటీన్ గా మారిపోయిందని, ఈ లైఫ్ స్టైలే తనను మంచి పొజిషన్ కు తీసుకెళ్లిందని, ఇది ఇలానే కంటిన్యూ అవాలని కోరుకుంటున్నట్టు రకుల్ తెలిపింది.